
# ప్రయాణం



— యస్. చంద్రమూర్తి

తేదీలూ అవీ సరిగ్గా గుర్తులేవు.

నాకు జ్ఞాపకం వున్నంతవరకూ ఈ ప్రయాణం అరవై సంవత్సరాల ముందు నాటిది. వెనక్కి తిరిగి చూస్తుంటే అంతా వింతగా అనిపిస్తోంది. దీన్ని గురించి వ్రాద్దామని యింతకు ముందెప్పుడూ అనుకోలేదు. ఇప్పుడే అనిపించింది పోనీ వ్రాస్తే అని. చదివితే ఎవరికైనా ఉపయోగం వుండవచ్చు అనిపించింది. అందుకే సాహసించాను... ఆ ఊరు పేరూ అవీ చివర్లో జ్ఞాపకం చేసుకుని చెప్తాను.

అక్కడంతా చీకటిగా వుంది. స్టేషనులో ఓ చిన్న కిరసనాయిలు దీపం లాంటిది మిణుకు మిణుకు మంటోందే కానీ దట్టంగా కురుస్తున్న చీకటి వర్షాన్ని ఏదేం అభ్యంతరం పెట్టలేకుండావుంది. ఆకాశంలో చుక్కలు తళ తళ లాడుతూ అర్థంకాని భాషలో ఏవో మాట్లాడు కుంటున్నాయి. స్టేషను మాష్టరు గదిలో ఏం చేస్తున్నాడో తెలీదు కానీ ఉన్నాడో లేడో అన్నట్లు నిశ్శబ్దంగా వుంది అక్కడకూడా.

ఆ చీకట్లో. ఆ నిశ్శబ్దపు ఎడారిలో, గట్టిగా చల్లగావున్న ప్లాటుఫారంమీద ఒక్కడ్నే నించున్నాను. నన్ను పంపించేందుకు ఎవ్వరూ లేరు. కాళ్లూ చేతులూ కట్టి పడేసినట్లు ఏదో తపనగావుంది. నేనున్నది నరమానవులుండే ప్రపంచంలా లేదు. ఏదో శుభ్రేలు మంటున్న గోళం. తల్లి గర్భంలో ముడుచుకు పడుక్కున్న శిశువు విముదలకోసం ఎదురుచూస్తున్నట్లు...

దూరాన్నించొచ్చే ఆశలాంటి వెలుగు కోసం ఎదురుచూస్తున్నాను.

ఈ స్టేషన్లో అసలు రైలాగుతుందా అనిపించింది.

ఇదేం రైలుస్టేషను? ఇక్కడ అసలు ఎవడెక్కుతాడు?

ఈ ప్రయాణం చేసే వాళ్లందరూ యిక్కడే ఎక్కుతారు. అప్పుడు వాళ్లకే యిలాగే వుంటుంది.

రైలొస్తోంది. నన్ను ఈ వింత ప్రపంచంలోంచి బయటికితీసి తెళ్లేందుకే వస్తోంది.

అందులోనన్నా నాతో మాట్లాడే వాడెవ్వడైనా వుంటాడా?

రైలొచ్చి ఆగింది. ఎదురుగా నిలబడ్డ పెట్టెలోకి జొరబడ్డాను. చీకటినే చూడ్డం నేర్చుకున్న కళ్లు వెలుగుమధ్య కెళ్లగానే వైర్లు కమ్మాయ్. కొంచెం సేపటివరకూ ఎవర్నీ గుర్తించలేక

పోయాను. నా కళ్ళకి తెరిపి కలిగిం తర్వాత అక్కడ చాలామందే కనిపించారు. నేను బండి ఎక్కినవేళ వాళ్ళందరికీ నిద్ర వేళయ్యింది. అందరూ జోగుతున్నారు. రకరకాల మనుషులు. రంగురంగుల కాగితాల కుప్పల్లా పడివున్నారు. వంటి మీద ధ్యాసేలేదు వాళ్ళకి.

నా కోసమే ఎదురు చూస్తున్నట్లు వాళ్ళిద్దరు మాత్రం మెళుకువగా వున్నారు. ఎందుకో వాళ్ళ మొహాలమీద ఉదుర్దా. ఆవిడకు కులాసాగా వున్నట్లు లేదు. ఆయాసంతో రొప్పుతోంది. నన్ను చూడగానే ఆయన కొంచెం జరిగి ఆవిడకేసి చూశాడు. ఆవిడ కళ్ళు విప్పింది పూర్తిగా. ఒకళ్ళను చూసి ఒకళ్ళు నవ్వుకున్నారు.

వీళ్ళెవరో నాకు కావలసిన వాళ్ళేనన్న భావం కలిగింది నాలో. కానీ నేను సహజంగామాత్రం వున్నట్లు లేదు. ఏదో వణుకు. బెదురు. వెళ్ళి వాళ్ళదగ్గర కూర్చున్నాను.

రైలు కదిలిందగ్గర్నుంచీ చల్లగాలి వీస్తోంది. వంటికి గుచ్చుకుంటోంది. ఆయనలేచి కిటికీతలుపు వేశాడు. ఆవిడ సంచీలోంచి వో దుప్పటితీసి నావంక చూసింది. కాసేపు తటపటాయించి ఆ దుప్పటి మడుగులోకి ప్రవేశించాను. అది కప్పివుంటే వెచ్చగావుంది.

నా కళ్ళు పూర్తిగా అలవాటు పడ్డాయ్ ఆ వెలుక్కి. వాళ్ళిద్దరికేసి రెప్ప వాల్చకుండా చూశాను.

ఆయన ఆవిడభర్తలా వున్నాడు. మనిషి బలిష్టం. నడివయసు దాటి వుండవచ్చు. ఆవిడ తెల్లగా వెన్నెలలా వుంది. జుట్టు చిందర వందరగా చెదిరి వుంది. ఎర్రటికుంకం బొట్టు నుదురంతా అలుముకుపోయింది చెమటతోపాటు ప్రాకి. ఆవిడకి ఆయాసం తగ్గినట్టుంది రొప్పడం మానివేసింది.

లేచి కూర్చుంది. ఫ్లాస్కులోంచి వెచ్చనిపాలు గ్లాసులోపోసి. గ్లాసు నాకందించింది. అవ్యాజమైన ఆ ఔదార్యం ఏమిటో ఎందుకో ప్రశ్నించే జ్ఞానం నాకు తోచలేదు. వద్దనకుండా అందుకని త్రాగేశాను.

ఆయన నాకేసిచూసి - మందహాసం చేస్తూ అన్నాడు:

'అంత బెదురుతూ కూర్చోవలసిన పని లేదు నాయనా ...'

నేను మాట్లాడలేదు.

'ఇదివరకెప్పుడూ యిలా ప్రయాణం చెయ్యలేదా ?'

'నాకు గుర్తులేదు'...

'అందుకే అంత కంగారుపడుతున్నావ్.'

అంటోంటే, ఆ కాస్తసేపట్లోనే నాలో అహం తలెత్తిం దనుకుంటాను. స్టేషనులో బిక్కు బిక్కు మంటూ నిలబడ్డ సంగతి మరుపుకు వచ్చిందనుకుంటా.

'నాకేం కంగారులేదు' అన్నాను.

ఆయన ఆప్యాయంగా నవ్వాడు.

'మేమూ బయలుదేరేటప్పుడు నీలాగే కంగారు పడ్డామయ్యా. చోటు దొరుకుతుందో దొరకదో. మనుషులతో ఎన్ని దెబ్బలాట లాడాలో, ఎన్నిమాటలు పడాలో అని. కానీ ఎక్కింతర్వాత యిక్కడి వాళ్ళు ఎంతో ఆదరంగా నన్ను చూశారు ...'

నేను మాట్లాడలేదు ...

వాళ్ళిద్దరూ మాట్లాడు కుంటున్నారు. నేను నెమ్మదిగా పెట్టంతా కలయజూశాను. ముసిలవాళ్ళూ, ముసక వాళ్ళూ, కుర్రాళ్ళూ, ఆడాళ్ళూ, చంటిపిల్లలూ, తలపాగాలవాళ్ళు, వంటిమీద చొక్కాల్లేనివాళ్ళూ, చుట్టలుపీల్చి తుపుక్కున ఉమ్మేసేవాళ్ళు ... రకరకాల యాత్రికులు.

ఎవరికుటుంబం వారిది. ఎవరి పిల్లలు వాళ్ళకి. వాళ్ళవాళ్ళని సముదాయించుకుంటూ, సర్దుకుంటూ ప్రక్కవాళ్ళతో నవ్వుతూ మాట్లాడుతూ, ఛీత్కారం చేస్తూ పోట్లాడుతూ ... పోతున్నారు—

ఏడ్చే పిల్లలూ — పాలిచ్చి వోదార్చే తల్లులూ, గీపెట్టే కుర్రాళ్ళూ ... చీదరించుకుని అల్లరి చెయ్యద్దని బెదిరించే తండ్రులూ. మూలిగే ముసలివాళ్ళూ, విసుక్కునే పడుచువాళ్ళూ.

అలా చూస్తూ చూస్తూ నెమ్మదిగా నిద్రపోయాను నేను.

అదేదో స్టేషను. రైలాగడంతో మెళుకువ వచ్చింది.

జనం అప్పుడే నిద్రలు లేచి హడావుడి ప్రారంభించారు. వేరుశెనక్కాయలమ్మే వాళ్ళూ, కాఫీ, టీలు అమ్మేవాళ్ళూ కేకలు పెడుతున్నారు

లేచి కూర్చున్నాను. పెట్లో ఆయన కనిపించలేదు. ఆవిడమాత్రం వుంది. ఆవిడ కళ్ళు ఎర్రగా వున్నాయ్. నిద్రపోయి లేచినట్లుంది. కుంకం రేకలు పూర్తిగా చెరిగిపోయాయి. జుట్టు మరీ చింపిరిగా వుంది. ఆవిడ ఆ సమయంలో ఎంతో ముసిలిదైపోయినట్లు అనిపించింది.

ఆయన ఏ బాత్‌రూంలోకో వెళ్ళుంటా డనుకున్నాను. లేచి కాళ్ళూ చేతులూ గట్టిగా జాడించి బద్ధకం దులిపి బండిలోంచి దిగాను. కుళాయిదగ్గరకెళ్ళి మొహం, కాళ్ళూ చేతులు కడుక్కుని, కాంటీన్‌లాంటిచోటుంటే అక్కడి జనసమూహంలో పడి హోరాహోరీన సంగ్రామంచేసి నలుగుర్ని ముందువెనకంకి నెట్టి టిఫిన్‌తిని, కాఫీ త్రాగాను. నాలుగిడ్డెన్లు పొట్లం కట్టించి, వో కాఫీ అమ్మనిచెప్పి పెట్టెదగ్గరకొచ్చాను.

ఆవిడ్ని టిఫిన్ తినమన్నాను. నిరాకరించింది. పోనీ కాఫీ పుచ్చుకోమని ప్రతిమాలాను. బలవంతంమీద నాలుగు గుక్కలు త్రాగింది. ఇడ్డెన్ల పొట్లం ఆయనకోసం వుంచాను.

'ఈ స్థలం నాదండీ. నేనిక్కడ ఎప్పట్నుంచో కూర్చున్నాను. ఇప్పుడు మీరు గొప్పగా వచ్చి ఆక్రమించారు గానీ,' అంటున్నాడొకాయన. తెల్లలాల్చీ నలిగి వుంది. జుట్టు చెదిరివుంది.

'పెద్ద చెప్పొచ్చావ్ లేవయ్యా. ఈ స్థలం ఈయనదంట. అలాగని రాసి పెట్టాడు. కాళీగావుంది కూర్చున్నాను. ఎవడొస్తాడో చూద్దాం అడ్డం.' అంటున్నాడు రెండో ఆసామి. ముతకరకం కాషాయం చొక్కా. తలకి ఆకుపచ్చరంగు పాగా. నలభై కొంటు నేతపంచె కట్టుకున్నాడు, చేతులో లావుపాటి చుట్ట సన్నగా, ఘాటైన పొగ. వదులుతోంది. కూర్చున్నచోటినించే నోటికి రెండువేళ్ళు అడ్డంపెట్టి బయటికి ఉమ్మేశాడు. దగ్గర్లో వున్నవాళ్ళు చిరాగ్గా మొహాలు ముడుచుకున్నారు. 'ఏమిటా ఉమ్మడం' అని వో నన్నపాటాయన కసురుకొన్నాడు. ఆయన భార్యేమో, కొంచెం వళ్ళున్నావిడ

ప్రక్కనుంచి మీకెందు కన్నట్లు వేలుతో ఆయన భుజం మీద వో పోటు పొడిచింది. గబగబా ఎవరికీ వినపడకుండా కళ్ళా పెదాలూ పిండుతూ దండించింది భర్తని.

గుర్రుగా, గిర్నూలాంగా, వో చూపు చూశాడు కామరాజు చొక్కా ఆయన.

'లేవయ్యా బాబా లే. మహాదర్జాగా ఆక్రమించావుగానీ' అంటున్నాడు లాల్చీ ఆయన. 'చెప్పాను కదుటయ్యా లేవమని. ఈ స్థలం నీ బాబు కొన్నాడా. ఆయన అబ్బనాటిదా? నీకు కాగితం రాసిచ్చాడేవిటి?' అన్నాడు కామరాజా చొక్కా ఆయన పెద్దగా నవ్వుతూ.

లాల్చీ ఆయన కోపంగా చూశాడు. జనంకేసి తిరిగి అన్నాడు.

'ఏమండీ, మీరే చెప్పండి. ఇక్కడ నేను కాదుటండీ కూర్చున్నది. ఎక్కడో దూరంనుండి వస్తున్నాను. ఈయనెన్నడైనా చూశారా యింతవరకూ? చూడండి ఎంత పొగరుగా కూర్చున్నాడో? ఆ మనుషుల మీదే ఉమ్మడం అదీ చూశారా?'

ఈమాట జనంమీద బాగా పనిచేసింది. అడ్డుచొక్కా ఆయన మోటుతనం జనానికి చిరాగ్గానే వుంది.

'ఔనండీ, ఆయన అక్కడే కూర్చున్నాడు' అన్నాడొకాయన లాల్చీ ఆయన్ని చూపిస్తూ.

'పాపం. అలా బాత్‌రూంకేసి వెళ్లి వస్తున్నారు' అన్నదొకావిడ కొంగు సవరించుకుంటూ.

'ఆయన అక్కడ కూర్చుంటే చూసింది నేను కాదుటండీ, నా కళ్ళు నన్నే మోసం చేశాయంటారేమిటి?' అన్నాడొకాయన. ఏదో పేపరు పదిమడతలువేసి విసురుతున్నాడాయన.

జనం తలోకరు తలోకవిధంగా అందుకున్నారు. లాల్చీ ఆయనదే ఆస్థలం అని తేల్చారు.

ఈ ధోరణిచూసి అడ్డచొక్కా ఆయన మెత్తపడ్డాడు.

అయితేమాత్రం ఏమండీ. నన్ను లేచి పోవాలనడం ఏం న్యాయం? ఏదో నేనూ టికట్ కొనుక్కున్న వాడ్నేనూ. కాస్త జరగమని కూర్చుంటే సరిపోలేదూ. అని కాస్త జరిగి చోటు చూపించాడు లాల్చీ ఆయనకి.

లాల్చీ ఆయన స్థలం అంతా నాదే అని యాగీ చెయ్యకుండా సర్దుకు కూర్చున్నాడు అడ్డచొక్కా ఆయన ప్రక్కనే.

ఇద్దరూ కొన్ని స్టేషన్ల దాటే వరకూ మాట్లాడుకోలేదు. ఆ తర్వాత ఏదో తీవ్రంగా మాట్లాడ్డం మొదలు పెట్టి, నెమ్మదిగా తమ చుట్టుపట్ల వున్న ప్రపంచాన్ని మర్చిపోయారు.

అప్పుడు గమనించాను నేను. ఆయన యింకా కనపడలేదు నాకు. బాత్‌రూంకెళ్తే యింతసేపేం చేస్తాడు?

ఆవిడకేసి చూశాను. ఆవిడ కిటికీలోంచి బయటకి చూస్తోంది. ఆవిడ తల మీద వెండితీగల్లా నెరిసిన వెంట్రుకలు కనబడ్డాయ్. మొహం తెల్లగా పాలిపోయినట్లుంది. నుదుట చెదిరిన కుంకం బొట్టుకూడా లేదిప్పుడు. చీరకొంగుతో మొహం తుడుచుకున్నట్లుంది. తెల్లని ఆవిడ చీరకొంగుకు కుంకుమ అంటి వుంది.

'చూడండమ్మా' అన్నాను నేను. ఆవిడ కిటికీ వైపునుంచి తల మరల్చి నావంక చూసింది.

ఆవిడ కళ్ళు సజలంగా, గాజులా తళతళ లాడుతున్నాయి. ఎందుకో చిన్న చిరునవ్వు రేఖ కదులాడింది పెదాలమీద. ప్రయోజకుడైన కొడుకువంక తల్లి చూసే చూపులా వుందా తీరు. ఆరూపం చూస్తే నా కెందుకో గుండె గుబగుబలాడింది. నన్ను నేనే దిటవు పరుచుకుని అడిగాను.

'ఆయన ఏరమ్మా' అని.

'దిగిపోయారు' అందావిడ...

'మరి మీరు ... మీరు ...' మాట పూర్తిచెయ్యలేక పోయాను నేను. మరి మీరు ఆయనతో ఎందుకు దిగలేదు. ఆయన మీ భర్తకాదా అని అడగాలని ఉద్దేశం. కాని అడగలేక పోయాను. గొంతుకలో సందేహం అడ్డుపడింది.

ఆవిడ నవ్వింది.

'ఒకే రైల్లో ప్రయాణం చేస్తున్న బాటసారులం. ఆయన స్టేషను వచ్చింది ఆయన దిగిపోయారు నేను దిగే స్టేషను వస్తే నేను దిగిపోతాను. అంతవరకూ నీతో యిక్కడే కూర్చుంటాను ...' అందావిడ.

'నీకేం భయం లేదు తల్లీ. మీకేం యిబ్బందిలేకుండా నేను చూసుకుంటానుగా' అన్నాన్నేను. ఆవిడ కళ్ళు చెమ్మగిల్లాయి మళ్ళీ.

'ఆయన దిగేముందు నీతో చెప్పమన్న మాటలు చెప్పవలసిన అవసరం లేదేమో అనిపిస్తోంది బాబూ. నువ్వే నాకు ధైర్యం చెప్తున్నావ్ యిప్పుడు. నీకెందుకు ఆ మాటలు!'

'ఏమన్నారమ్మ ఆయన' అని అడక్కుండా వుండలేకపోయాను.

'ఆయనకి నువ్వెంతో పసివాడివిగా కనిపించావ్. చూడు రుక్మిణమ్మా. అబ్బాయితో చెప్పూ. జీవితం నడకలో కాలికెన్నెన్నో ఎదురుదెబ్బలు తగులుతాయ్‌కానీ అధైర్యపడద్దూ ... తన వివేకం చెప్పినట్లు తన బాధ్యత నిర్వహిస్తే పైన నడిపే వాడెవ్వడో ఉండనే వున్నాడు అన్నిటికీ అని...దిగబోయే ముందు ఎంతో అనుకున్నానని కూడా చెప్పూ' అన్నారు ఆయన.

ఆయన వాత్సల్యానికి నా కళ్ళు తడయ్యాయి. కళ్ళు మూసుకుని ఆయన గురించే ఆలోచించాను. ఆయన రూపం కళ్ళముందు కదలాడింది. దిగబోయే ముందు ఆయనతో మాట్లాడలేక పోయానే అని బాధకలిగింది.

వాళ్ళిద్దరూ, ఆ అన్యోన్యం అదీ చూసి అనురాగం పండిన భార్యా భర్తలని అనుకున్నాను. ఆత్మ లొకటై పోయిన ప్రాణులనుకున్నాను. కానీ ప్రయాణంలో అదాటున కలిసిన వాళ్ళన్న నిజం తెలియగానే చాలా వెలితిగా అనిపించింది. నేను ఎక్కినప్పుడు వాళ్ళిద్దరూ ఎంత అంతఃకరణ చూపించారు తోడి ప్రయాణికులైతే అంత చనువుగా వుంటారా! అంత అన్యోన్యమా. వీళ్ళిద్దరూ ఒకళ్ళకొకళ్ళు ఏమీకారూ? ఆయన స్టేషను రాగానే మూటాముల్లే సర్దుకొని ఆయన అలా దిగిపోతే ఈవిడ యిలా సాగిపోవడమే? నాకు చాలా అసంతృప్తిగా అనిపించింది. వాళ్ళది అన్యోన్యత, అనురాగం అనిపించేట్లు ప్రవర్తించారు. అలా

అనిపించి వాళ్ళు విడిపోతే తనకేందు కింత లోటుగావుంది ! వాళ్ళకేం అని పించలేదూ ? ఈవిడకేం అనిపించటం లేదూ. అడగాలనిపించింది. కాని ఆవిడ చాలా నిర్లిప్తంగా వుంది ఆవిడ మనసు ఎలా తెలుస్తుంది నాకు ? లోతు ఎక్కడో వున్న నేలను అదృశ్యంచేసి మరుగుపరి చిన సముద్రంలోని ఆటిలా వుంది.

అంతర్యంలోకి చొరనియ్యకుండా వుంది.

ఓ దీర్ఘమైన నిట్టూర్పువిడిచి వూరు కున్నాను.

ఆవిడ నాకు దగ్గరగా జరిగి కూర్చుంది.

రైలు పోతోంది. ఏదోనది దాటుతోంది నెమ్మదిగా. రైల్లోంచి జనం పైసలు విసురుతున్నారు నీళ్ళలోకి. విసిరి ఆ నీళ్ళకి దణ్ణం పెడుతున్నారు. అన్నీ చూస్తూ అలా కూర్చున్నాను.

నది దాటేంతర్వాత కొంచెం దూరం వెళ్ళి రైలాగిపోయింది. నా దగ్గరగా కూర్చున్న ఆవిడ శరీరం వణుకు తున్నట్లు తోచింది. వళ్ళు ముట్టుకు చూశాను. వేడిగావుంది. కళ్ళు సగం మూతలు పడ్డాయి.

'ఒంట్లో బాగుండలేదామ్మా' అని అడిగాను.

నీరసంగా నవ్విందావిడ తన సంచీ తీసి చూపించింది. అందులో మాత్రలు న్నాయి, తియ్యమంది. సంచీ అంతా వెతి కాను. అన్నీ బయటికిలాగి దోర్లించాను. ఓ డబ్బా బయటపడింది అది తెరచి చూడమంది. తెరిచాను కాని, ఖాళీగా వుంది డబ్బా.

'అయిపోయినట్లున్నాయ్' అంది. నాకు చాలా భయం వేసింది. కాళ్ళూ చేతులూ ఆడ లేదు. ఆవిడ పరిస్థితి చూస్తే ప్రమాద కరంగా వుంది. ఆవిడ కేమయినా అయితే? నా ప్రాణమేదో లాగినట్లయింది. పెట్టంతా కలబోసి చూశాను. ఓ మూల ఒకాయన కళ్ళజోడు తొడుక్కొని పెద్ద లావుపాటి పుస్తకం ఒకటి చదువుతు న్నాడు. ఆ పుస్తకంమీద మనిషి బొమ్మ వుంది. ఆయన ప్రక్కన మందుల సంచీ లాంటి దొకటుంది. గబగబా ఆయనదగ్గర కెళ్ళాను.

'మీరు డాక్టరా?' అని అడిగాను. ఆయన తల వూపాడు. ఆయన చేతులు పట్టుకొన్నాను. 'ఆవిడ చూడండి. చాలా బాధ పడుతోంది. ఏదో విఘాతమైన జబ్బు తగిలినట్లుంది' అన్నాను. ఆయన తేలు కుట్టినవాడిలా నా చేతులు విడిపిం చుకొని, గబుక్కున సంచీ అందుకొని, నా చేతుల్లో వుంచి మేం కూర్చున్న చోటికి వచ్చాడు. ఆయనవెనకే నడిచాను. ఆవిడ్ని చూశాడు. పరీక్ష చేసి......సంచీ తెరిచి...ఇంజక్షనొకటి తీసి యిచ్చాడు ఆవిడికి.

లావేటరీలోకి వెళ్ళి ఆయన చేతులు కడుక్కుంటుంటే తువ్వాలు పట్టుకు వెళ్ళాను. ఆయన చేతులు తుడుచుకున్నాక నా జేబులోంచి కొంత డబ్బుతీసి ఆయన చేతి లోవుంచాను. ఆయన చిరునవ్వునవ్వి డబ్బులు జేబులో వేసుకున్నాడు. నాభుజం మీద తట్టి, ఫరవాలేదండి, తగ్గిపో తుంది అన్నాడు. ఆవిడ ప్రక్కనే వెళ్ళి కూర్చున్నాను మళ్ళీ.

నాకేసి ఆప్యాయంగా చూసి నవ్వింది. ఆవిడ చేతులు యింకా కొద్దిగా వణుకు తూనే వున్నాయ్. భయం లేదు బాబూ, నా స్టేషను వచ్చేసరికి తగ్గిపోతుంది, అంది. ఆవిడ స్టేషను ఏమిటో అడు గుదా మనుకున్నాను.

నేను మాట్లాడే లోపల ఆవిడ అందు కుంది.

"ప్రయాణంలో ఈ నొప్పి తగుల్తూనే వుంటుంది. అప్పటికప్పుడు తప్పదు బాబూ...నువ్వెందు కంత కంగారు పడతావ్?'

'అబ్బే నాకేం కంగారు లేదే' అన్నాను అవసరమైకంగానే...

'రైలెందుకో ఆగిపోయినట్లుంది. చూసి రాకూడదూ' అందావిడ.

ఔను ! రైలు ఆగిపోయింది. వచ్చిని పొలాల మధ్య ఆగి వుంది.

క్రిందికి దిగాను. రైలు చివరి పెట్టెలు ఎక్కడో వంపులో దూరంగా ఆగాయి. కనిపించ లేదు. జనం చాలా మంది దిగారు.

ఎందు కాగిపోయింది రైలు?


ఎప్పుడు బయలుదేరుతుంది మళ్ళీ ?

ఎదర ఎక్కడో రెండుమైళ్ళదూరంలో గండి పడిందిట. నీరు వేగంగా ప్రవహి స్తోందిట. పట్టాలు వంగిపోయాయి. అందుకై రైలాగిపోయింది.

ఇంతకీ ఎప్పుడు బయలుదేరుతుంది మళ్ళీ...

ఏమో చెప్పలేరు. ఈ రోజు బయలు దేరకపోవచ్చు. చాలా సేపు యిక్కడ వుం డక తప్పదు. ఇప్పుడిప్పుడే నీరు వేగం తగ్గుతోంది. ఓ గంటలోగా నీరుతగ్గితే పట్టాలు సరిచేసి మళ్ళీ బయలుదేరచ్చు.

గుండెల్లో రాయి పడింది. ఆప్తరు మంటున్న ఈ ఒంటరితనంలో యిలా ఆగి



వాతే జన్మం గడేం కాను...

రకరకాలుగా జనం మాట్లాడుకుంటూ బండి దిగి పట్టాల ప్రక్కన కూలబడ్డారు.

అవిడతో ఈ విషయం చెప్పి నేనలా పొలాలమ్మట బయలుదేరాను.

వంటపొలాలు దగ్గర్లో వున్నాయి కనక తరిధావుల్లో యేదో వూరుంటుందని నమ్మకం. రెండు మైళ్ళదూరంలో గండి పడి పట్టాలే కొట్టుకుపోయాయ్. ఇక్కడ వంటపొలాలు కంటి వంటగ పచ్చగా వున్నాయి. గాలితో కలిసి గుసగుసలాడుతున్నాయ్.

అప్పుడే గింజ కడుతోంది కంకుల్లో. ఆకుపచ్చని కంకి ఒకటి తెంపి ఒక్కొక్క గింజే తుంపి నోట్లో వేసుకుని కొరుకుతూ నడుస్తున్నాను.

పిచ్చుకలూ, తుమ్మెదలూ, గొల్లభామలూ యెగురుతున్నాయి. తొందరగా ఉడతలూ గంతులేస్తూ పోతున్నాయ్. నన్ను చూసి దూరంగా చెదిరిపోతున్నాయి. అలా ప్రకృతిలో ఒకణ్ణే పరవశిస్తూ నేను నా ముందెవ్వరో నడుస్తున్నట్లనిపించింది.

వెనక్కి తిరిగిచూశాను. రైలు కంటిచూపు కందనంత దూరం నడిచి వచ్చేశాను. తిరిగి ముందుకు చూశాను. పొలాల మధ్య ఎర్రచీర కట్టుకున్న మనిషి. పడుచు పడుచు. అగి నాకేసి చూస్తోంది. నేనూ తన వంక చూస్తూండడంతో, తల దించుకొని నెమ్మదిగా నడక ప్రారంభించింది.

ఆమె కాళ్ళకి కట్టుకున్న అందెలు సన్నగా ఘల్లుఘల్లుమంటున్నాయి. గోధుమ రంగులో వుంది గంధపు చెక్కలా. నల్లమబ్బుల్లాంటి కురులు. ముంగురులు గాలిలో నెమళ్ళలా నృత్యం చేస్తున్నాయ్. చెంపలమీద చేపల్లాంటి కళ్ళు నల్లని కాటుక కళ్ళు: నాజూరు నడక. కొండల్లోంచి ఉరుకుతున్న సెలయేరులా వలికిపోతోందామె వయ్యారం.

కళ్ళప్పగించి చూశాను. వాలుగా వోసారి చూసి ముందుకు సాగింది. నా వళ్ళంతా ఏమో అయిపోతోంది

'అదుగో చూడండి, ఎందు మీరు ఒంటరిగా ఈ పొలాలంట తిరుగుతున్నారు. పల్లె పిల్లలా లేరే?' అన్నాను గుండె గొంతుకలో కొట్టు అడ్డం పడుతుంటే,

# ప్రయాణం

ఉక్కిరిబిక్కిరవుతూనే.

ఆమె మెల్లగా వెనక్కు తిరిగింది.

'మీరెవరు? మీ వేషం చూస్తూంటే ఈ ఊరబ్బాయిలా లేరే' అంది.

'ఈ ఊరబ్బాయిని కానే! అదుగో అక్కడ ఆగిపోయిన రైలు ప్రయాణీకుడ్ని.'

'నేనూ ఆ రైల్లోనే ప్రయాణం చేస్తున్నాను. అందులోంచే దిగి యిటొచ్చాను.'

'మీవాళ్ళెవ్వరూ లేరా?'

'ఉన్నారు.'

మరి మీరొక్కరూ...ఆడతనం...భయం లేదూ...'

నవ్వింది. 'నా వెనక...మగతనం...మీరుండగా...భయం ఎందుకూ' అంది.

—నేను సిగ్గుపడి నవ్వాను

కొంతదూరం మాట్లాడకుండా నడిచాం.

'ఆ ఆకాశం నీలంగా ...'ఆ కొండలు నల్లగా...ఈ పొలాలు పచ్చగా బావున్నాయ్ కదూ—'అందామె అసందర్భంగా.

'ఊం...మీరులేందంగా...ఒంటరిగా... నేను మీ దగ్గరగా— బావున్నాం కదూ' అన్నాను ఆమెను అనుకరిస్తూ ధైర్యం చేసి. నన్నేదోశక్తి ముందుకి తోస్తోంది.

'ఊం...నడుసువారే.' అనేసి వో గట్టుమీద కూర్చుంది.

దూరాన వున్న పల్లెవేపు నడుద్దామన్న సంగతి మర్చిపోయాను.

అక్కడే ఆ దేవకన్యకు వో అడుగు దూరంలో కూలబడ్డాను నేనుకూడా. నా వంక తిరిగి వోసారి అలవోకగా నవ్వింది. ఆ సమయంలో పాతిక నక్షత్రాలొకసారి చమక్కు మన్నట్లనిపించింది.

'ఏమిలా చూస్తున్నారు'

'ఊం' అన్నాను స్వప్నంలోంచి.

'ఎవరో తెలీనిపిల్ల... యింత చురుకూ చనువుగా మాట్లాడుతోం దేమిటా అనా!'

'ఊం' అన్నాను అదే స్వప్నంలోంచి.

'తెలిసేదేంటి! వో రైల్లోనే ప్రయాణం చేస్తున్నాం. వో రకమైన కష్టంలోనే వున్నాం. పరిచయానికి యింతకన్నా యోగ్యతా పత్రం ఏం కావాలి?...

... ... ...

ఈ రైలు ప్రయాణీకు లెవ్వడూ యిలాగే కలుసుకుంటారు.

'దూరంగావున్న ఆ ఆకాశాన్ని ఆనేలని చూడండి. అలాగే కలిసి పోతున్నట్లే వుండి ప్రయాణం చేస్తున్నాయి. ఎంతెంత దూరం నుంచో...ఎంతెంత కాలం నుంచో. అదేవాటి కలయికకి పురస్కారం. వాటి స్నేహానికి ఆస్కారం...'

ఆమె మాటలు అర్థం కావటంలేదు. కానీ తియ్యగా వున్నాయి.

అర్థం కాకపోయినా మృదువుగా వుండి హృదయాన్ని ఉవ్వెత్తున పొంగించే సంస్కృత శ్లోకంలాగా.

కాని ఆవిడ సూచన అర్థం అయ్యిందనిపించింది. నేనేం చేస్తున్నానో సరిగా ఆలోచించలేదు.

ఆమెకు దగ్గరగా జరిగాను. ఆమె దూరంగా జరగలేదు. ఆమె చుట్టూ చేతులువేసి నావైపు తిప్పుకున్నాను. ఆమె నా చేతులమధ్య యిమిడి పోతోంది.

తెల్లగా వెన్నెలలా నవ్వుతూ, కమ్మగా గంధపు చెక్కలా ఆనందపు సువాసనలు నా ఊపిరి నిండా నింపుతూ నా హృదయంలోని సంగీతంలా మారి నాలో ఏకమైపోయింది.

పచ్చని ఆ పైరులమధ్య మా వయసులు, హృదయాలు పురివిప్పి ఆడాయి.

అలా ఎంతసేపున్నామో గుర్తులేదు.

నా చేతులమధ్య ఆ పూవుల పొది అలసి అలా తన్మయంగా పడుకుని వుంది.

ఆ క్షణాలు...అవి వెన్నెల కిరణాలు.

బొయ్యిమంటూ రైలుకూత వినపడడంతోనే ఉలిక్కిపడ్డాం యిద్దరం.

లేచి తొందరగా నడక ప్రారంభించాం.

'నాతో వచ్చేస్తావా' అని అడిగాను.

'ఊం,' అందామె.

'మరి మీవాళ్ళున్నారన్నావ్...'

'మావాళ్ళు...ఊం ఉన్నారు. రైలెక్కినప్పుడు ఒక్కదాన్నే ఎక్కాను. ఎక్కాంతర్వాత అల్మాయంగా చూసుకున్నారు. అయినా ప్రేమం విడిపోక తప్పదుగా. నే వెళ్ళేంతదూరం వాళ్ళెలా వస్తారు?'

'కనీసం వాళ్ళతో చెప్పనన్నా చెప్పవా?'

'ఎందుకు చెప్పను? చెప్తాను. వాళ్ళని

విడిచి మీ పెట్టెలోకి వెళ్తున్నానని చెప్తాను' అంది రాధ...

ఇద్దరం రైలుదగ్గర కొచ్చాం. వాళ్ళు...రాధతోడు. వాళ్ళు ఆత్రంగా నాకేసి రాధకేసి చూస్తున్నారు. అయన ...రాధకి తండ్రిలాగా వున్నారు. ఆవిడ రాధకి తల్లిలాఉంది. అతనెవ్వరో రాధకి "అన్నగారిలా, అతనిప్రక్కన ఆమె రాధకు వదినలా...అందరూ ఆత్మబంధువుల్లా విచారంగా, సంబరంగా, సంకోచంగా. భయంగా. చూస్తూ రాధకు చేతు లూపారు.

రాధ కళ్ళలో నీళ్ళు తిరిగాయి...

.మేం మా పెట్టెలో ఎక్కిన కొంచెం సేపట్లో మామూలుగా బయలుదేరింది రైలు.

నాప్రక్కనే రాధ...నాతోనే రాధ.

తిరిగి యధావిధంగా జనం...వాళ్ళ ధోరణులు.

మేం కూర్చున్నపోటికి ఎవరో బల హీనంగా వున్నాడు ... వచ్చి కూర్చో బోయాడు...

నాకు కోపం వచ్చింది.

'ఈ స్థలం నాది. ఇక్కడే నువ్ చేరటానికి వీల్లేదు'న కసిరాను.

ఏదో అనబోయి మానేసి వెళ్ళి పోయాడు అతను. స్థలం నాదయి పోయింది. నేను ఆక్రమించుకున్నాను. నా పేర దస్తావేజు రాయించుకున్నాను!

రాధ కబుర్లు చెప్తోంది...

ఎవరో ఒకతను బోలెడు రకాల సామానులు తీసుకుని వచ్చాడు. వాటిలో నో మేడ, విశాలంగా స్థలం... చుట్టూ అందంగా తోట... చేరవాడే కొన్నాను. నా సొంతస్థలంలో దానేట ప్రతిష్టించాను.

స్థలం కొనడం అయింది. మేడొకటి సంపాదించాను. ఈ ప్రయాణంలో ఇంకా ఆస్థంతా నాది. నేను స్వంతంగా తీసుకు పోవచ్చు.

ఈ సందట్లో ఆ వి డ — నన్ను మొదట్లో ఆదరించి, కప్పుకోడానికి దుప్పటియిచ్చి, తాగడానికి పాలిచ్చిన ఆవిడ... సంగతి మర్చిపోయాను. కానీ ఆవిడ న న్ను మర్చిపోదు. అలా పడు కునే నాకేసి, రాధకేసి సంతృప్తిగా చూస్తోంది.

హఠాత్తుగా ఆవిడ వంకకి చూసే సరికి ఆవిడకి మళ్ళీ ఏదో బాధగా వున్నట్లు తోచింది. ఆత్రంగా పెట్టంతా కలయజూశాను. లేడు. ఆ డాక్టరు లేడు.

ఏదో స్టేషన్‌లో దిగిపోయాడు.

ఈవిడకేమన్నా అయితే ?

'ఎలా వుందమ్మా' అని అడిగాను కంగారుగా.

ఫరవాలేదు బాబూ. నువ్వు జాగ్ర త్తగా వున్నావ్ ... ఈ అమ్మాయి ఎంచక్కా చిలకలావుంది. మీ రిద్దరూ సుఖంగా...నాకేం ఫరవాలేదు బాబూ. ఇందాకనే చెప్పాడు గద్దు. నా స్టేషన్ కాస్సేపట్లో వచ్చేస్తుంది. అక్కడ దిగిపోయానంటే యీ బాధుండదు, మన శ్శాంతిగా వుంటుంది... అంటోందావిడ.

ఆవిడ స్థితి చూస్తుంటే నాకు మనసు ద్రవించుకు పోతోంది. గుండె బరువుగావుంది.

రాధకళ్ళు చెరువు లౌతున్నాయ్.

బండెక్కడో ఆగింది. ఏదో స్టేషను.

తలుపు తెరుచుకుంది. ఎవ్వరూ ఎక్క లేదు...తిరా బండి కదలబోతుంటే తలుపు దగ్గర నో పసికందు. ఎవరు పడుకో బెట్టారో... వెనక ఎవ్వరైనా ఎక్కుతా రేమోనని చూశాను. ఎవ్వరూ ఎక్క లేదు...

బయటికి చూశాను. ఏం కనిపించదు. తెనెక్కిన స్తబ్దతలాగాన గుభేలు మంటోంది.

రైలు కదిలిపోతోంది. తలుపు పడ బోతోంది. పసికందు కెవ్వున ఏడు స్తున్నాడు...

రాధ గబగబా కళ్ళు తుడుచుకొని అటు చూసింది.

'అయ్యో వాడ్ని చూడు బాబూ' అంది ఆవిడ.

జనం అందరూ నిర్లిప్తంగా చూస్తు న్నారు.

ఒక్క ఉరుకున వెళ్ళి పిల్లాడ్నితెచ్చి రాధఒళ్ళో పడుకోబెట్టాను.

కెవ్వున ఏడుస్తున్న వాడ్ని రాధ ఊరుకోబెట్టింది.

ఎర్రగా గులాబి మొగ్గలాంటి ఆ కుర్రాడు రాధఒళ్ళో...ఒదిగి పోతున్నాడు.

ఆవిడకేసి తృప్తిగా చూశాను. చటు క్కున అనిపించింది వీడి కెవరివో పోలిక లున్నాయని.

'రాధా వీడ్ని పెంచుదామా' అన్నాను.


'కాలూ చెయ్యీ వచ్చిన వీడ్ని పెంచక పోతే ఏమైపోతాడు' అంది రాధ.

'మరి వీడికి పేరేం పెడ్దాం?'

'ఎవ్వరూ పెట్టకుండరంటావా రాధా?'

'పోనీ వాడ్నే అడగండి' అంది రాధ నవ్వి.

'ఏరా పేరు చెప్పవేమడూ ... అన్నాను వాడివేపు తిరిగి.



[illegible]

...న్నారు.

'పోనీ త్యాగరాజా అని పిలవండి' అంది ఆవిడ ఆయాసపడుతూ.

'అసలు రాధా. త్యాగరాజా అని పిలుద్దాం. ఆయన పేరు కూడా త్యాగరాజే...

'అదే రాధా ఎక్కువగానే నన్ను పలకరించి ఆదరించినాయన. ఆయన ఎప్పుడో దిగిపోయారు రాధా. నాకెందుకో అనిపించింది ఈ కుర్రవెధవలో ఆయన రూపం వుందని... త్యాగరాజంటేనే బాగుంటుంది' అన్నాను.

రాధ జవాబు లేదు...కాదన లేదు.

కుర్రాడితో ఆడుతోంది.

కళ్ళు మూసుకున్నాను నేను. రైలు పోతూనే వుంది...నదిలో పారే నీటిలా ఆలోచనలు మనసులో.

అదేదో స్టేషను. రైలాగింది.

'వచ్చేసింది స్టేషను... రైలాగిపోయింది. నేను దిగుతున్నాను బాబూ' అందావిడ.

ఆవిడ కళ్ళలో నీళ్ళు. నా మనసులో దిగుళ్ళు. ఏ స్టేషనో చూడవల్సొస్తుందో తెలియదు. ఆవిడ దిగిపోతుందని తెలుసు. కాని దిగకుండా వుంటే బాగుండునని పిస్తోంది.

ఆవిడ యిక నా దగ్గర వుండదనే ఆలోచనకు అలవాటు పడాలని ప్రయత్నిస్తున్నాను.

ఆవిడ దిగిపోయింది ..

# ప్రయాణం

నేను చెయ్యి వూపలేదు. వూపినా కనపడదు.

రైలు మళ్ళీ నడవడం ప్రారంభం అయిం తర్వాతగాని గమనించలేదు.

'అయ్యో రాధా...ఆవిడసంచీ, బట్టలూ పాతలూ అన్నీ యిక్కడే వదిలేసింది ...' అన్నీ వదిలి దిగిపోయింది రాధా ... ఈ చీకట్లో...ఈ చలిలో ఏమైపోతుందో... గాద్గదికంగా వున్నట్లుంది నా కంఠం.

రాధ నా భుజంమీద చెయ్యేసింది.

'ఎందుకంత కంగారు పడతారు...' అంది నవ్వి. ఆమె కళ్ళు తడిగా వున్నాయి.

ఇద్దరం బలహీనంగా నవ్వుకున్నాం.

రైలలా వెళ్తా వుంటే నెమ్మదిగా ఆ సంగతి మర్చిపోయాం. ఆ బాధ మర్చిపోయి వో ఆకృతిని, ఆ ఆకృతిచుట్టూ అల్లుకున్న జ్ఞాపకాల్ని వదిలిపరచుకున్నాం.

పెట్టంతా కలయ జూశాను. ఉహుఁ! వాళ్ళందరూ ఎప్పుడో దిగిపోయారు.

ఎక్కడ దిగిపోయారో...

లావు ఆయన లేడు...అడ్డ చొక్కా ఆయన లేడు...సన్నటాయన చూపుకు దొరకలేదు...ఆయన భార్యా[illegible] ..ఎలా అవుతుంది...ఏమో సరిగ్గా మాసిన గుర్తు లేదు ..ఆమె ఎవ్వరో వుంది.

వాళ్ళు కూర్చున్న స్థానాల్లో...... ఎవరో క్రొత్త ప్రయాణీకులు.

[illegible]. ఆయన దిగిపోయారు. ఆవిడ దిగిపోయింది. ఇక్కడున్న వాళ్ళందర్లోకి పాత ప్రయాణీకుణ్ని నేనేగా. ఇక రావలసింది నా స్టేషనే అనుకున్నాను. కళ్ళు చిట్లించి బయటికి చూశాను. కంటికి కనిపించేదంతా మసకగానే వుంది. మరెంతసేపు ఈ రైల్లో? ఎంతసేపు...నా స్టేషన్ రావటం ఖాయంకదా. నా స్టేషనేమిటి? మా స్టేషన్కదా...రాధ, దాంతో పాటు వాడు...త్యాగరాజుగాడు.

'ఉహుఁ' అన్నాను.

'ఏమిటండీ' అంది రాధ ఆత్రంగా.

'నేను దిగిపోతాను రాధా...'

'మీరుదిగడం ఏమిటండీ.'

'ఏం వాళ్ళు దిగిపోలేదూ? ఆవిడ... ఆయన. అవతల పెట్టెల్లో వాళ్ళూ... అందరూ దిగేవుంటారు ... యిక దిగాల్సింది నేనేగా.

'మీరే దిగడం ఏమండీ? మీ వెనకే నేనూ.'

'ఊఁ కరెక్ట్ రాధా! నా వెనకే నువ్వు ...నా కోసారు ... వాడు... త్యాగరాజుగాడు నీ వెనక.

'రాధా ప్రయాణంలో ఏమేమో పోగు చేశాను ఎందరెందరితోనో దెబ్బలాడాను. ఈ ప్రయాణం శాశ్వతం అన్నట్లు ప్రవర్తించాను. కాని ముందొస్తోంది నా స్టేషను. అక్కడ దిగిపోతాను. నాతో ఏం పట్టుకెళ్తాను? ఏం పట్టుకెళ్లను ...ఇవన్నీ [illegible]కు...మన స్నేహం గుర్తు.

ఎక్కడో కలిశాం. ఒకటే అనుకున్నాం ...అలాగే వుండిపోతాం అనిపించింది...

ఆ సమయంలో ఏమేమోచేశాం...పాపం.

ఇదుగో! నా స్టేషన్ వస్తోంది. నాతో నువ్వురావు...ఆ తర్వాతే నీ స్టేషను.

నువ్వింక నాతో ఎక్కలేదు. నాతో దిగవు.


కాని ఈ ప్రయాణంలో వున్నంతసేపు తోటి ప్రయాణీకులనేం యిబ్బంది పెట్టానో.

నిన్నేం కష్టపెట్టలేదు కదా రాధా.. వీరేమంతు అలాగయితే అదో సంతృప్తి.

పోనీ ఎలాంటివాడైనా దిగాల్సిందేగా? ఏదోరకంగా దిగుతాడు ...'

రాధ నావంక వెర్రిగా చూస్తోంది.

వాడ్ని జాగ్రత్తగాచూడు రాధా ...



ఇవన్నవాడికే. ఈ బొమ్మలూ. ఈవన్నీ వులూ ...

త్యాగరాజు ఏమిటోలా చూస్తున్నాడు ...ఏమనుకుంటున్నాడో మరి.

రాధ ఏడుస్తోంది...వెర్రిరాధ.

అయినా దిగిపోతాను నేను. ఏమీ లేకుండా. ఎవ్వరూ వెంటరాకుండా. రాధ ఏడ్చి మొత్తుకున్నా ఆగలేను.

వచ్చేసింది...ఆ స్టేషను. రాధ ఏడుస్తోంది. బోర్డుకోసం చూస్తున్నాను ...

నేను దిగడానికి రడీయే.

కానీ ఈ స్టేషనూ అలాగే వుంది. నే నెక్కిన స్టేషన్‌లాగే. ఏమీ కనపడదు. ఏం వినపడదు ... అవ్యక్తం ... అంతా అవ్యక్తం...అనూహ్యం.

మళ్ళీ...ఇక్కడ దిగాక ఏంచేస్తాను ? మరో రైలా. మరో ప్రయాణమా?

ఏమో ! ఏమీ తోచలేదు.

మర్చిపోయానన్నాను కదూ. నే నెక్కిన స్టేషను పేరు గుర్తొస్తోంది...

ఊం...ఈ స్టేషను పేరు చూశాక అదీ గుర్తొస్తోంది.

ఆ స్టేషను పేరు జననం! ఈ స్టేషను పేరు? మరణం...

ఈ ప్రయాణం? ఓయస్! జీవితం...

ఎంతమంది చేశారు ఈ ప్రయాణం ఏమో...

ఎన్నిసార్లు...నాకేం తెలీదు.

మళ్ళీ మళ్ళీ చెయ్యమంటే చేస్తారా చెయ్యొచ్చు...

మీరందరూ చేస్తున్నారా...ప్రయాణం లోనే వున్నారు మీరు

ఆ స్టేషనూ ఈ స్టేషనూ వొలాగే వున్నాయే.

కావచ్చు ... జననం ... మరణం మరణం...జననం ?

రెంటిమధ్యా ప్రయాణం...వచ్చినప్పుడు తెచ్చిందిలేదు ... వెళ్ళినప్పుడు తీసుకు పోయిందిలేదు...

ఎలా చేస్తారో ప్రయాణం మీయిష్టం. తోటి ప్రయాణికులకు కష్టం లేకుండా చేస్తారో...కష్టం కలిగేట్టు చేస్తారో... ఏమో ?

ఎలాచేసినా దిగిపోతారు. కాని మంచిగ చేస్తే ఉన్నవాళ్ళ ఆలోచనలో ప్రయాణం చేస్తుంటారు

ఇంకేం చెప్పను ... నామటుకు నేను ఇదిగో ది...గి...పో...తు...న్నా...





